లెట్టాయి. రోజూ రక్తం పడుతున్నది. డాక్టర్ సురేష్‌చంద్రని కనుక్కుంటే "గాలిమార్పువల్ల లాభమేమీ కలగలే"దని చెప్పాడు. "అయితే, ఇక్కడ వుంచడం దేనికి? కొత్తయింటికి సంధ్యని మారుస్తాన"ని చంద్రశేఖరరావు అన్నాడు. "సరే, మీ యిష్టమ"ని డాక్టర్ అన్నాడు. అంబ్యులెన్సు తెప్పించి, సంధ్యని కొత్తయింటికి మార్చాము.

పదిహేను రోజులకి సుధ కాలు నయమైంది. నొప్పి పూర్తిగా తగ్గకపోయినా, ఆసుపత్రి గది లోనే కొద్దిగా అటూ ఇటూ తిరగగలుగుతున్నది. పదిహారవ రోజున సుధని ఆసుపత్రినించి డిశ్చార్జ్ చేసారు.

సరిగ్గా సుధ వచ్చిన యిరవై రోజులకు సంధ్య మరణించింది. తోటలోని బంగళాలో "పదిహేను యిరువై రోజులవరకు బ్రతుకుతానో, లేదో" అని మధుతో అన్నమాట నిలబెట్టుకుంది.

మధు కూడా తాను ఆడినమాట తప్పలేదు. చనిపోవడానికి పూర్వం ఒక మాటువచ్చి సంధ్యని చూచి వెళ్ళాడు.

(ఇంకా ఉంది)

---

స్కెచ్

# పోటీలేని పేరయ్య

వడ్లపట్ల దయానందం

క్రిందటి మునిసిపల్ ఎన్నికలలో ఫలానా వార్డులో ఫలానా ప్రముఖ వ్యక్తిమీద మూడోట్లతేడాలో వోడిపోయి ప్రముఖుడైన పేరయ్య, స్వాతిచినుకులకోసం వేచివుండే ముత్యపు చిప్పలా ఆనాటినుండి మళ్ళీ ఎన్నికలకోసం కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూస్తునేఉన్నాడు.

ఆనాడే అన్నారు ప్రజలంతా ఐక్యకంఠంతో... నైతికవిజయం పేరయ్యదేనని. ఈమాట అప్పట్లో కమీషనర్ సైతం స్వయంగా అని, అభినందించక పోలేదు. "పేరయ్యా ఆయనమీద ఇన్నోట్లు తెచ్చుకున్నావంటే నిజంగా విజయం నీదేనోయ్ ఇక వచ్చేసారి ఎక్కడికి పోతుందిలే!" అని.

దురదృష్టవశాత్తూ జరగవలసిన ఎన్నికలు ఒకటి రెండుసార్లు వెనక్కిపోవడం బ్రహ్మాండమైనవ్యథనే కల్గించాయ్ పేరయ్యకి. అసలు మూడోట్లతో వోడిపోయిన మర్నాడే వచ్చే ఎన్నికలకిక తిరుగు లేకుండా గెలవగల దారి ఏర్పడిపోయిందయ్యె. అందుకే అంత ఆత్రంగా ఎన్నికలకోసం ఎదురు చూస్తూంట. దానికి తోడు ప్రజాసేవలో నిగ్గుతేలిన వాడన్న ప్రతీతి సైతం పట్టణమంతా వ్యాపించక పోలేదు. ఇక్కడ కొంత పట్టణంయొక్క సంగ్రహ రాజకీయ వాతావరణం ఇవ్వడం అవసరం.

పట్టణం మొత్తంమీద ఏ వార్డులో ఏ టిక్కెట్టుపై పోటీ చేస్తున్న అభ్యర్థికైనా చైర్మనో... అథవా వైస్ చైర్మనో అవుదామన్న ఆశ రవ్వంత హృదయాంతరాలలో లేకపోలేదు. దానిక్కారణం పోటీచేస్తున్నవారిలో అధికసంఖ్యాకులు పట్టణ మునిసిపాలిటీ తరంలో ఎప్పుడో ఓసారి ఆ యా పదవుల నలంకరించి ఉన్నవారే! అందువల్ల పార్టీలనీ క్రమశిక్షణలనీ తలచడానికే ఏమాత్రం వీలులేకుండా పోయింది. పార్టీబంధాలన్నీ కేవలం నూలుపోగులై పోయినాయ్. నిర్మొహమాటంగా నిర్భయంగా అన్ని పార్టీలు...వాటితాలూకు పరువును పబ్లీకుగానే 'ఆక్షన్'కు పెట్టేశాయి.

ఇట్టిపరిస్థితిలో స్వతంత్రఅభ్యర్థయిన పేరయ్యకి ముందు కౌన్సిలర్‌గా నెగ్గగలిగితే... ఆ దరిమిలాను వాళ్ళ గుద్దులాటల మధ్య...కనీసం వైస్ చైర్మన్ అయినా కాగల అవకాశాలు అన్నివైపులనుండీ కానరావడంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

అందుకే ఎట్టిపరిస్థితిలోనైనా ముందు కౌన్సిలర్ అయిపోవాలి. లేకపోతే... ఊహూ.. వెధవ ప్రాణమైనా తనకనవసరం.

అదే పట్టుదలతో ముందమాంతం నామినేషన్ పారేశాడు...యాభైరూపాయల డిపాజిట్టుతో. ఒకటీ రెండూ కాదు, ఎందుకైనా మంచిదని ఎనిమిదిఫారాలు కట్టుదిట్టంగా వ్రాయించి...పది మందికి చూపించి మరీ దాఖలు చేశాడు. అప్పటి క్కాని ధైర్యం చిక్కలా తప్పులు గట్రా ఉండి ఏడు పోయినా ఎనిమిదోదైనా నిఖరంగా నిలుస్తుందని.

అయితే పేరయ్యలో కొన్ని ప్రతిభా విశేషాలు లేకపోలేదు. తలలు మార్చడంలో కాని... బురిడీలు వెయ్యడంలో కాని కేవలంసామాన్యుడేనని తలవడం శుద్ధ పొరపాటే అవుతుంది.

క్రిందటి ఎన్నికలలో తనమీద మూడోట్లతో నెగ్గిన ఆ ఫలానా ప్రముఖునికి ఈసారి నెగ్గగల పక్షంలో ఆయన పార్టీ తరఫున చైర్మన్ కాగల అవకాశాలు లేకపోలేదు. కాని సరిగ్గా ఆ సమయానికే సదరు ప్రముఖవ్యక్తికి ఇతర దేశాలు సందర్శించవలసిన ఏదో బృందంలో చిన్న సభ్యత్వం లభించడం...ఒకవిధంగా పేరయ్య అదృష్టమనే అనాలి. అయినా ఆయన ఫారెన్ టూర్ కి బయలు దేరబోయేముందు ఒక సన్నిహితుని చెవిలో ఒక మాట వెయ్యకపోలేదు- "వెధవ ఫారెన్ టూర్... దీనివల్ల మనకొరిగే దేమిటి? కాస్తోకూస్తో చేద్ది వదలడం మినహా. ఇక్కడేవుంటే ఇంచక్కా కౌన్సిలర్ అవ్వొచ్చు...ఆ పైన చైర్మన్. లక్షమంది ప్రజల పైన అధిపత్యం వహించడమంటే సామాన్యమైన విషయమా ఏమిటి? ఎట్టి పరిస్థితిలోనైనా నామినేషన్ టైమ్ లోపలే తిరిగొచ్చేస్తాను" అని.

బయటికి పొక్కిపోయిన ఈమాటే రవ్వంత ఖంగారు కల్గించింది పేరయ్యకి. దీనిపైన—

ఒకరోజంతా ఆలోచించి ఒకానొక చక్కని పాచిక తయారు చేసుకుని సదరు ప్రముఖవ్యక్తి పార్టీకి సంబధించిన మరో ప్రముఖవ్యక్తి దగ్గరికి స్వయంగా రాయబారం వెళ్ళాడు.

"చూడండీ...మీ పార్టీకి గనక మెజారిటీ వస్తే చైర్మన్ అవుదామన్న ఉద్దేశం మీకున్నది. చూచారూ ముందు మీకు పార్టీలోనే పోటీ తప్పదు. ఆయనెలానూ ఇక్కడ లేడు కనుక... నా వార్డులో మీపార్టీ టిక్కెట్టాయనకిరాకుండా చూచేయండి ... నా కౌన్సిలర్ వోటు మీకే వేస్తాను...మీరు చైర్మన్ కావచ్చు."

భేష్...అన్నాడాయన. మా పార్టీ తరఫున మీకు పోటీలేదు పొమ్మన్నాడు. పోయేటప్పుడు చిన్న హెచ్చరిక మాత్రం చేశాడు—

"మాటమీద నిలబడాలిసుమీ" అని.

అక్కడ్నుంచి మరోరాత్రి ఆలోచించుకుని వేరొకపాచికతో ఇంకొకపార్టీ కార్యాలయానికి వెళ్ళిపోయాడు పేరయ్య.

జరిగిపోయిన రాష్ట్ర ఎన్నికలదృష్ట్యాను...మారిపోయిన పితృదేశ పార్టీపోలసీ దృష్ట్యానూ... చితికిపోయిన ఆ పార్టీ కార్యాలయం కలగూరగంపలా తయారయి ఉంది. ప్రజాపార్టీకి స్థానికంగా ఏకైక నాయకుడు...ఏకైక సభ్యుడూ... టూకీగా చెప్పుకోవాలంటే ఏకైక సర్వసమూ-ప్రస్తుత చైర్మనూ అయిన వేరొక ప్రముఖుని గుప్పెటలో స్థూలంగా దూరిపోయి కూర్చుని ఉన్నదాపార్టీ.

"చూచారూ...నాకు ఆపార్టీ పోటీ తప్పిపోయింది. పెట్టినా లాభంలేదన్న సంగతాళ్ళకి తెలిసిపోయి గౌరవం దక్కించుకోడానికి వాళ్ళు నాకు పోటీ పెట్టడంలేదు. ఇక మీరు పెట్టినా పెద్ద లెక్కలోనిదికాదు...క్రిందటిసారి వచ్చిన యాభై వోట్లయినా ఇప్పుడు రావు. ఆ విషయం మీకూ తెలుసు. ఊరికినే వదిలెయ్యలేక ఏదో అడ్డుపెడదామని నామినేషన్ పారేయించారా... అది మీ కేమాత్రం మంచిచేసి పెట్టదు. నెగ్గటం నిఖరం...అప్పుడిహ చైర్మన్ఓటు మీకు వెయ్యకపోవచ్చు. అడ్డుపెట్టకుండా వదిలేశారా నాఓటు మీకే పడగల అవకాశం సైతంలేకపోలేదు" చాటుగా చెప్పాడు పేరయ్య చైర్మన్ చెవిలో.

చైర్మన్ హృదయానికి రవ్వంత షాక్ తగిలినట్లైంది. మనసులో అనుకున్నాడు:

"ఔరా...ఎలక్షన్ స్టంట్ లో వీడు మనల్ని సైతం మించిపోయేలా ఉన్నాడే" అని.

అయినా ఫ్రంటు తరఫున అక్కడ పోటీ పెట్టినా ఎలానూ నెగ్గే అవకాశం లేదుకనుక... "పోనీలే మనం మాత్రం చెడ్డని ఎందుకనిపించుకోవాలీ" అనుకుని..."నూరింట ఒకపాలైనా వీడి ఓటు మనకి పడే సావకాశం లేకపోలేదు గదా" అనుకుంటూ—

"అదేమిటోయ్ పేరయ్యా. నీకు పోటీ ఏమిటోయ్. నువ్వు మావాడివని మేం మొదట్నుంచి లెక్క కట్టుకుంటూనే ఉన్నామయ్యే...మనం... మనం ఒకటి! ఆమాట మఱచిపోబోకు" అన్నాడు.

పోటీలేని పేరయ్య రవ్వంత అనుమానం పీడించగా నామినేషన్ గడువులో ఆఖరుక్షణం గడిచిపోయేవఱకూ...అనుక్షణం కిటికీలోంచి కమిషనర్ ఆఫీసు గదిలోకి తొంగిచూస్తూనే ఉన్నాడు.

గడువు పూర్తయిపోయాక అభ్యర్థుల నిఖర

జాబితా అధికార ప్రకటన...ఫలానా వార్డులో ఫలానా పేరయ్యకి పోటీలేదు పొమ్మన్నది.

వెంటనే బజారుకుపోయి కొత్తకండువా కొని బుజాన్నేసుకున్న పేరయ్య టౌన్ మొత్తంమీద పోటీలేదన్న ఖ్యాతి తనొక్కడికే దక్కిందికనుక గతంలోనే పురప్రముఖుడిగా గుర్తించబడి అనేక సార్లు పత్రికలలోసైతం ఎక్కి ఉన్న తను ఇప్పుడు పురప్రముఖాగ్రణినని స్వగతంలో చెప్పుకుని... సహచరులకి చాటుగా ఏదో చెవిలో ఊదాడు. భేష్ పేరయ్యా... అంటే ... భేష్ పేరయ్యా అన్న అభినందనలు అన్ని వార్డులనుంచీ కుప్ప తెప్పలుగా వచ్చిపడ్డాయ్.

పేరయ్య కార్యక్రమమిప్పుడు పూర్తిగా మారి పోయింది. పేరయ్య పలుకుబడి ప్రభావ మిప్పుడు మరికొన్ని వార్డులలోసైతం పనిచెయ్యవచ్చు.

తదితర పురప్రముఖులందరికి ... ముందుగా ప్రత్యర్థులమీద కౌన్సిలర్సుగా నెగ్గవలసిన దురవస్థ సంప్రాప్తించడంవల్ల వేరొక కార్యక్రమానప్పుడే ఎట్లానూ చేపట్టలేరు. ఆ బాధ పేరయ్యకెట్లానూ లేరు కనుక...చిన్న వల పుచ్చుకుని సహచరులతో సావకాశంగా బయలుదేరాడు.

మరో ఇద్దరు స్వతంత్ర సభ్యుల్ని పట్టగలిగితే దిట్టమైన గ్రూపుకి పునాది పడ్డదన్నమాటే... పూర్తిగా మెజారిటీ తెచ్చుకోలేని ఏ పార్టీ ఐనా తనని శరణుజొచ్చక తప్పదు. అప్పుడిహ ఏకంగా చైర్మన్ పదవే తనకి వచ్చినా రావచ్చు. అథవా వైస్ చైర్మన్ పదవైనా విధిగా వచ్చితీరుతుంది. ష్యూర్.

పోటీలేని పేరయ్య జిందాబాద్.

పేరయ్య తాజాకోర్కెలు మొగ్గదొడగి, పుష్టించి వికసించి పరిమళించి రాలిపోక ఫలించుగాక!

---



## వధూవరులు సుధారాణి - బుద్ధప్రసాద్

వధువు నాయుడుగూడెం వాస్తవ్యులు శ్రీ గారపాటి పున్నయ్యగారి కుమార్తె. వరుడు ప్రముఖ కాంగ్రెస్ వాది డాక్టర్ ములుప్పూరి రంగయ్య, ఎం. ఎల్. ఏ. గారి కుమారుడు. వివాహం మే 19న జరిగింది.